


## (దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

## -141-

(25 ' మార్చ్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**"ఎండాకాలం వచ్చేటప్పటికి** ఎక్కడలేని పనులూ వచ్చిపడతాయి. ఇప్పుడే ఊరు ప్రయాణాలు, ఇప్పుడే ఉద్వాహాలు - వాటితోపాటు ఊరగాయ పనులు. ఈ ఎండల్లో ఇన్ని తట్టుకునేసరికి ఎండు పుల్లలుగా తయారవుతాం.

"వట్టి వ్రేళ్ళ తడికలు కట్టుకుని, మట్టి కూజాతో నీళ్ళు పెట్టుకుని, తొట్టెలనిండా నీళ్ళు పోసుకుని చిరాకుపుట్టినప్పుడల్లా చెంచాడు పోసుకుని, ఫాన్ వేసుకుని, ఏ డ్రింకులో త్రాగుతూ, ఎండవేడి డిగ్రీల సంగతి ఆలోచించకుండా దివ్యంగా కాలక్షేపం చేసే బ్రతుకులుకావుగా ఇవి?

"ఇంటికి వచ్చిన తర్వాత వడగొట్టి పడిపోయినా, నాలిక పిడచగట్టి తూలిపోయినా, ఈ ఎండనే పుచ్చపువ్వుల వెన్నెల క్రింద భావించి, బయట తిరిగి రాకపోతే సంసారాలు సాగవాయె. ఎండాకాలం వచ్చిందని ఎవరొచ్చి వూరికే జీతాలిస్తారు? ఎవరొచ్చి ఉపచారాలు చేసిపోతారు? ఏం వుందీ జగత్తు. ఉన్నవాళ్ళకు ఉత్సవాలు లేని వాళ్ళకు వేవిళ్ళు" అని మొన్న ఒకావిడ ఎండలో తిరిగొచ్చి వరండాలో కూర్చుని పైన చెప్పినట్లుగా ఉపన్యాసం ప్రారంభించింది.

ఈ మధ్య నేను ఒక ఆషామాషిలో 'మధ్య తరగతి మనోవేదనలు' అని వ్రాశాను. అది చదివినవారొకరు "వ్రాసింది బాగుంది సరే. మధ్య తరగతివారి మనోవేదనలు అనేకం వున్నాయి. వాటిని గమనించి మాసానికోసారన్నా వ్రాస్తూ వుండండి. అందుకో కొంత పరమార్ధముంటుంది" అని వ్రాశారు.

పైన చెప్పిన ముత్తైదువ ఇచ్చిన ఉపన్యాసం మధ్యతరగతివారి వేసవి బాధల్లో ఒక భాగమవుతుంది. కనుక ఆ విషయాన్నే మరికొంత పరిశీలించి, ఆవిడను ప్రశ్నించి ఈ వ్యాసం వ్రాస్తున్నాను.

ఆవిడగారిని అడిగాను "వేసవికాలంలో పోనీ వూళ్ళు వెళ్ళడం మానుకోలేరా?" అని.

ఆవిడగారు "అయ్యో అదెలా సాధ్యమవుతుంది? పిల్లలకు శెలవులివ్వగానే ఇంట్లో పెద్దవాళ్ళంతా శాప ముక్తులైనట్లు పరుగులు తీస్తారేమూలకో. మీరు చెపితే నమ్ముతారో లేదో కొందరు స్టేషనుకి వెళ్ళేదాకా ఏ వూరికి టిక్కెట్టు కొంటారో తెలియదు" అన్నదామె.

"బాగుంది పూర్వ సంస్థానాధీశులిలా ప్రయాణాలు చేసేవారుట. స్టేషన్‌కి వెళ్ళిన తర్వాత గుమాస్తాను పిలిచి ముందేవైపు రైలు వస్తుందో కనుక్కో. ఎక్కడికి వెళ్ళాలో నే చెపుతాను. అనేవారుట. రైలు సంగతి తెలుసుకుని అటువైపున వున్న నగరానికి టిక్కెట్టు కొనమనేవారుట. మీరు చెప్పింది అలాగే వుంది" అన్నాను.

"అయ్యో మీరలా చెపుతున్నారుకానీ ఈ కాలంలో వాళ్ళేం తక్కువవాళ్ళా? సంస్థానాలు లేవుగానీ ఇళ్ళలో కూర్చునే ఫోజులు చూస్తే ఆస్థానంలో కూర్చున్నట్లే వుంటుంది. ఇక హోదా అంటారా? చెప్పలేం. వాయిదా పద్ధతిమీద వంటి సామాన్లు కొనుక్కుంటున్న హోదాల్లో సంస్థానాధీశ్వరులు చాలదు. ఉన్న డబ్బుకు ఏరోజుకారోజు ఉద్వానం చెప్పవలసిందే ఏం చెప్పను నాయనా" అందామె.

"నిజమే వేసవికాలం ప్రయాణాలు అధికమే. ఎంత అవస్థపడటానికైనా అంగీకరిస్తారు గానీ ప్రయాణం మానుకోరు. పైగా ప్రయాణానికి ఎంత సొమ్ము అవుతుంది? ఈ విషయాన్ని పురస్కరించుకుని ఒకామె అంది. "మా యింటికి రండి. రండి. అని ఉత్తరాలు వ్రాస్తారు. ఎలా వస్తామనుకుంటారు? చంటివాణ్ణి, ఎడపిల్లనూ వెంటవేసుకుని వెళ్ళినా రాను ఎనిమిది, పోను ఎనిమిదీ కావాలి. పై ఖర్చుకో పదికి తక్కువ కావు. ముచ్చటగా వెళ్ళి ముప్పయి రూపాయలెక్కడ వదిలించుకుని రాగలం?" అని.

అది విన్న భర్త వెంటనే అన్నాడు "నీ మొఖం ముప్పయి రూపాయిలని గొడవ చేస్తున్నావు. అసలు రమ్మని వ్రాసేదెవరే ఈ రోజుల్లో. వారం రోజులు ఆతిధ్యమిస్తే వాళ్ళకు మాత్రం కావు ఆ ముప్పయిరూపాయలు. వెళ్ళలేకపోతే మానుకో అంతేగానీ వాళ్ళమూలంగా ముప్పయి అవుతాయనే గొడవదేనికి? ఈ సంవత్సరం ఒకరు ఆహ్వానించారని చెప్పుకొనడానికైనా అవకాశం ఇస్తున్నారు. అందుకు సంతోషించు" అన్నాడు.

తర్వాత ఆ ముత్తైదువ చెప్పింది "పూర్వపు ప్రయాణాలైతే ఏ రెండెడ్ల బండి కట్టుకునో, రాదారి పడవలోనో బయలుదేరి వెళ్ళేవాళ్ళం. చుట్టాలందరూ పదిమైళ్ళ చుట్టుకొలతలో వుండేవారు. రైలెక్కినా అట్లా ఎక్కి ఇట్లా దిగడంగా వుండేది. ఒక రాత్రీ, రెండు పగళ్ళూ కూడా చాలడంలేదీ రైలు ప్రయాణాలకు. అయినా తప్పడంలేదు. భారతదేశమంతటికీ ప్యాసులున్నట్లు బయలుదేరతారు" అన్నది.

"ఏం చేస్తారు మరి బంధు ప్రేమ అలాంటిది. దూరాభారాలు ఆలోచించనివ్వదు. ఒకరినొకరు దర్శిస్తే చాలనిపిస్తుంది" అన్నాను.

"దర్శించాలనిపిస్తుంది. రైళ్ళకు, బస్సులకు ఎంత దర్శిస్తే వారి దర్శనమవుతుంది? శాస్త్రం చెప్పినట్లు దూరాన వుంటే ప్రేమలుండకపోతాయా? ఉరకాలంటే కష్టంకానీ, కోర్కెలుంటాయి. ఉండటం సహజం. వీలైతే రోజుకోసారి కాకపోయినా నెలకోసారి అయినా బంధు ప్రదిక్షిణం చెయ్యాలనిపిస్తుంది. ఎలా సాధ్యం నాయనా?

"ప్రతినెలా మనం చేసుకోవలసిన ప్రదక్షిణలు చాలా వున్నాయి. నెల మొదటి వారంలో ఇంటియజమాని దర్శనం చేసుకోవాలని అదైనా డబ్బు చేత్తో పుచ్చుకుని, ఆ తర్వాత పాలమనిషి దర్శనం, వెచ్చాలకొట్టు యజమాని దర్శనం, లాండ్రీ యజమాని దర్శనం ఇలా ఎందరి దర్శనమో చేసుకుని దక్షిణ అందించి, అక్షింతలు నెత్తిన వేయించుకుంటేగానీ ఆత్మారాముడు కొంతవరకు శాంతించడు.

"ఆ పైన ఇంకెందరి దర్శనాలు అనుకోకుండా చేసుకోవాలో. ఒక నెల్లో డాక్టరు దర్శనం, ఒక నెల్లో క్లాత్ షాప్ యజమాని దర్శనం, ఇలా ఎందరి దర్శనమైతేకదా నాయనా దూరంగా వున్న బంధువుల దర్శన భాగ్యం కోసం యాచించేది?" అన్నదామె.

నిజమే మరి, ప్రయాణాలు చేయడం ధనంతో కూడిన విషయమైంది. అందువల్ల చాలామంది అభిలాషలకు ఆటవిడుపు ఇవ్వవలసి వస్తుంది. "రావాలని ప్రయత్నిస్తున్నాం. కానీ ఇంట్లో, వంట్లో పరిస్థితులు సరిగ్గా లేకపోవడం వల్ల అనుకున్నట్లుగా బయలుదేరలేకపోతున్నాం. కానీ ప్రయాణం తలపెట్టని రోజు మాత్రం లేదు" అని జాబులు వ్రాయడం

జరుగుతూ వుంటుంది. కానీ వూరికి ఆ వూళ్ళో పడాలనుకునేవాళ్ళకు ఇలాటి సాకులు ఎంతమాత్రం నచ్చవు. ఎలాగో అలా ప్రయాణాలు సాగిస్తూనే వున్నారు. అది వ్యక్తుల్లో వుండే అన్యోన్యత మీద ఆధారపడి వుంటుంది. దానికి ఏ ఆర్ధిక పరిస్థితులూ అడ్డంరావు.

వెనుక ఒకసారి నేను బందరులో వుండగా చలంగారు ఉత్తరం వ్రాశారు. విశేషాలు వ్రాయండి అన్నారు చివర. నేను వ్రాశాను. "విశేషాలుంటే వ్రాసేదాకానా, విజయవాడలో వచ్చి వ్రాలేవాణ్ణి. ఎంత దూరం గనుక?" అని వ్రాశాను.

ఆయనగారు దానికి జవాబు ఒక్క పంక్తిలో వ్రాశారు. "అయితే నువ్వు నావాడివే" అని.

ప్రయాణాలు ఎంత బాదరబందీతో కూడుకున్నవి అయినా, వాటిలో కొంత బలం ప్రాబల్యం వుంటాయి. ప్రయాణం ఖర్చు నిత్యావసరాల జాబితాలో పడకపోయినా జీవితావసరాల జాబితాలో పడితీరాలి. ఏదో వంకలు చెప్పి ఎగగొట్టేందుకు వీలులేని విషయాలలో బంధు దర్శనం ఒకటి.

ఈ కాలంలో బంధు మిత్రాదులతో కదిలిపోయి, పీఠాధిపతుల్లాగా కొన్నాళ్ళు తిష్టవెయ్యడం కష్టంగాని, వీలును బట్టి వెళ్ళి కొంత రెస్టు సంపాదించడం ఎంతో అవసరం. అంతేగాని తలుపు ఘడియలో వేసే గరిటెలాగా కొంపలోనే పడివుండటం మంచిదికాదు.

పైన చెప్పిన ముత్తైదువ సంసారపక్షంగా చెప్పింది. అది కాదనలేం. అవుననలేం.

Post your comments